క్లుప్తంగా

క్రీడాకారిణులకు అభినందన

తోట్లవల్లూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా జిల్లా స్థాయి బాడ్మింటన్‌లో ద్వితీయస్థానం సాధించిన క్రీడాకారిణులను మండలంలోని భద్రిరాజుపాలెంలో ఉపాధ్యాయులు అభినందించారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో క్రీడాకారిణులు మండేపూడి నాగమల్లేశ్వరి, బొంతు ఉషారాణిని పాఠశాల హెచ్‌ఎం ఎండీ రిజ్వాన్ శుక్రవారం అభినందించి జ్ఞాపికలు బహూకరించారు. సచివాలయ కన్వీనర్ మండేపూడి శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు ఫణీంద్ర కుమార్, జ్యోతి, కుసుమకుమారి, యోబు, సునీత, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

తోట్లవల్లూరు: పేదలకు ఆపన్నహస్తం అందించటంలో లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్‌గుప్తా తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మండలంలోని యాకమూరులో 30 పేద కుటుంబాలకు నిత్యావసర కిట్‌లను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్, క్యాబినెట్ కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు నూతన వస్త్రాల బహూకరణ



పామర్రు: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ వితరణతో ఆలయ అర్చకులతో పాటుగా పేద బ్రాహ్మణులకు నూతన వస్త్రాలను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక శివాలయం వద్ద శుక్రవారం పేద బ్రాహ్మణులు భేతనబోట్ల శ్రీనివాసమూర్తి తదితరులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను బహూకరించారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సమాఖ్య అధ్యక్షురాలు కృపావతి, నాయకులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, ధనాల నాగేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన సెబ్ సీఐ

కైకలూరు: ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (సెబ్) సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుధా, ఎస్సై రాజేంద్రప్రసాద్ ఆటపాకలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలుసుకున్నారు.

ఎస్సీల భూములను ఆక్రమిస్తే కేసుల నమోదు

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

కైకలూరు: ఎస్సీల భూములను ఆక్రమించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాచపట్నం గ్రామానికి చెందిన జోసఫ్ నవీన్‌కుమార్ తన సర్వే నంబరు 117, 117/2లో మొత్తం 62 సెంట్లు అసైన్డ్ భూమిలో 26 సెంట్లను ఆక్రమించుకున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. కోర్టు సైతం తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెప్పాడు. తనకు చెందిన భూమిలో మెరక పనులను రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో చైర్మన్ విక్టర్ ప్రసాద్ రాచపట్నంలో భూమిని శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ముందుగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. అప్పటి వరకు ఫిర్యాదుదారుడు మెరక పనులకు ఆటంకాలు కలిగించవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పోతురాజు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు, సర్పంచ్ అల్లూరి మంగారావు, సోషల్ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటరత్నం, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతగా వాహనాలు నడపాలి

గుడివాడ టౌన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని వాహన తనిఖీ అధికారి ఎన్. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు నారాయణస్వామి, సంగీతరావు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలతో గ్రామాల ఏర్పాటు

గుడ్లవల్లేరు: జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహ సముదాయాలతో చిన్న చిన్న గ్రామాలుగా రూపు దిద్దుకుంటున్నాయని తహసీల్దార్ వై.శ్రీనివాస్ అన్నారు. గుడ్లవల్లేరు జగనన్న కాలనీలోని ప్రభుత్వ నివేశ స్థలాల లబ్ధిదారులకు చేస్తున్న రిజిస్ట్రేషన్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. డీటీ బి.కనకదుర్గ, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు నరసింహారావు, సీహెచ్.ఉమామహేశ్వరరావు, వీఆర్వోలు ప్రకాష్, గంగాధరరావు, పాల్గొన్నారు

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్సు స్థాయిలోని ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులకు శుక్రవారం టాలెంట్ టెస్టు నిర్వహించినట్లు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం టి.హనుమప్రసాద్ తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గణితం, ఈవీఎస్ సబ్జెక్టులలో పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించామని తెలిపారు. స్కూల్ కాంప్లెక్సు సెక్రటరీ అంకరాజు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీఎం జగన్ లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- తోట్లవల్లూరులో వేడుకగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- రూ.8.13 కోట్ల చెక్కు అందజేత



తోట్లవల్లూరులో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: సమసమాజ స్థాపనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు తోట్లవల్లూరులో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డ్వాక్రా అక్క,చెల్లెమ్మలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, ఆసరాకు సంబంధించి రూ.8.13 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గంలో నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 181.87 కోట్లను డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. నేటి జగనన్న పాలనలో కుల, మత, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనను, ఐదేళ్ల జగనన్న పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకు అన్నివర్గాల ప్రజలు, డ్వాక్రా అక్కచెల్లమ్మలు అండగా ఉండి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

బూటకపు హామీలతో వస్తున్నారు..

బూటకపు హామీలు, బాబు ష్యూరిటీల పేరుతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వస్తున్నారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఒక్క జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక టీడీపీ, జనసేన, ఇతర పార్టీలు కలిసి మూకుమ్మడిగా దాడి చేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. పామర్రు టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా అబద్ధపు ప్రచారాలకు అంతులేకుండా పోతోందన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, సర్పంచ్ పెనుమత్స రాధిక, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఏపీఎం కృష్ణంరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు డి. హిమకుమారి పాల్గొన్నారు.

సీఎం జగన్ చెప్పాడంటే చేస్తాడంతే

ఎమ్మెల్యే డీఎన్నార్



చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ తదితరులు

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతే అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండవల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షలాది మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత సొమ్ము డ్వాక్రా మహిళ ఖాతాల్లో జమ చేశారని అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీ టీసీ ముంగర విజయనిర్మల, గుమ్మడి వెంకటేశ్వరరా వు, బేతపూడి యేసోబురాజు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, ఎంపీటీసీ గూడపాటి ఝాన్సీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర బీసీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, ఉప సర్పంచ్ జొన్నలగడ్డ నాగలక్ష్మి, బొమ్మన బోయిన గోకర్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ వరప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యుడు దత్తాడ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థినికి మాత్రను వేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: విద్యార్థుల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎమ్మెల్యే శుక్రవారం అందించారు. ఆయన మాట్లాడుతూ మాత్రల పంపిణీలో వైద్య, విద్యాశాఖాధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కొల్లేటికోట పీహెచ్‌సీ వైద్యులు బి.శంకర్, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ తలారి మణిమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, డాక్టరు కె.అన్నపూర్ణ, ఉప సర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుభాషిణి, నాయకులు నిమ్మల సాయి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

మొవ్వ: నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 6,124 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మొవ్వ పీహెచ్‌సీ డాక్టర్లు ఎం వేదరాజ్, సీహెచ్ రాజేశ్వరి, నిడుమోలు పీహెచ్‌సీ డాక్టర్ సాయికుమార్ పర్యవేక్షణలో పలు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, జూనియర్ కళాశాలలో ఈ మాత్రలను పంపిణీ చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: నులి పురుగుల నివారణ మాత్రలతో ఆరోగ్యపరంగా పిల్లలకు మేలు అని గుడ్లవల్లేరు పీహెచ్‌సీ వైద్యురాలు యశస్విని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది శుక్రవారం అందించారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీ పరిధిలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శాస్త్రి, వైద్యాధికారి డాక్టర్ గోపాల నాయక్ పరిశీలించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండ జోల్ మాత్రల పంపిణీ శుక్రవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా 38 పాఠశాలల్లో కార్యక్రమాన్ని ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంఈఓ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, ఎంపీహెచ్‌ఎస్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో నివారించవచ్చని మూలలంక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి షేక్ నస్రీన్ అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు శుక్రవారం పంపిణీ చేశారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు శుక్రవారం పంపిణీ చేశారు. ముదినేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు వి శాంతి, వడాలి జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.ప్రభుదాస్, ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

పెదముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం పెదముత్తేవి గ్రామంలో సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

పామర్రు: మండలంలోని కనుమూరు గ్రామంలో శనివారం సాయంత్రం ఆరు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

గుడ్లవల్లేరు: ప్రజానీకానికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. కౌతవరంలో ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీటిని స్వచ్ఛందంగా సరఫరా చేసేందుకు శుక్రవారం ఆయన ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నీటి పరీక్షలను సిబ్బందితో చేయించారు. గ్రామ కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

గుడివాడ టౌన్: పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. శుక్రవారం స్థానిక 11వ వార్డులో నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందాలనే సంకల్పంతో ప్రస్తుత ఆరోగ్య సేవల విలువను రూ. 25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నూతన ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జగదీష్, ఖాదర్‌బేగ్, కోమలి, కుసుమ, సుల్తానా పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు

ఎంపీపీ వేద సుప్రజ

పమిడిముక్కల: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడున్నాయని ఎంపీపీ కాసాని వేద సుప్రజ అన్నారు. వీరంకిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ, సర్పంచ్ కాసాని నాగేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయన్నారు. వైద్యులు షమీరా, చంద్రశేఖర్, అఖిల, ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: పల్లెల్లో ప్రజానీకం పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వెణుతురుమిల్లిలో స్థానికులకు కంటి పరీక్షలను నిర్వహించారు. సర్పంచ్ కొప్పినేని శేషవాణి, కార్యదర్శి వి.భాగ్యరాజు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి రూ.4.66 లక్షల జరిమానా

పమిడిముక్కల: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో విద్యుత్ వినియోగదారులు గృహాలు, వాణిజ్య సర్వీస్‌లపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 41 బృందాలుగా ఏర్పడి 1,539 గృహసర్వీసులు, 132 వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ 279 సర్వీసులకు అదనపులోడు 197 కేడబ్ల్యూ మొత్తానికి రూ.4,66,290 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈ 9440812362, 6440812363, 8331014951 నంబర్లకు సమాచారమందివాలని కోరారు. తనిఖీల్లో మచిలీపట్నం ఈఈ భాస్కరరావు, పామర్రు డీఈఈ సుందరరావు, పమిడిముక్కల ఏఈ శ్రీనివాసరావు, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

వెట్టి చాకిరీ నిర్మూలనకు సమష్టి కృషి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: సమాజంలో వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి చెప్పారు. వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా కైకలూరు పంచాయతీ కార్యాలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. బాండ్ పేపర్లపై చాకిరీ చేయించుకోడానికి ఎవరైనా సంతకాలు తీసుకున్నా అవి కోర్టుల్లో చెల్లబోవన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం వెట్టి చాకిరీ నేరమని చెప్పారు. సర్పంచ్ దానం నవరత్నకుమారి మాట్లాడుతూ వెట్టి చాకిరీపై అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ వెట్టి చాకిరీ నిర్మూలన చట్టాలను వివరించారు. బార్ జనరల్ సెక్రటరీ బందెల లక్ష్మణరావు, న్యాయవాదులు పి.పవన్ కాంత్, డి.శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ భూషారావు, కోర్టు కానిస్టేబుల్ పోతురాజు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యురాలు ఏ.దుర్గాభవానీ, పారావలంటీరు పి.వేణుబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

గుడివాడ టౌన్: పట్టణంలో జగనన్న కాలనీల ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ శరవేగంగా జరుగుతోంది. పేద ల సొంతింటి కల నెరవేర్చే ప్రక్రియలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించిన ఇళ్ల స్థలాలు లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ప్రభుత్వం ఇళ్ల స్థలాలను సొంతం చేసే ప్రక్రియలో భాగంగా ఈ రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సచివాయ ఉద్యోగులు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేసి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ వేగవంతం చేశారు. అన్ని వార్డులలో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం కావడంతో సచివాలయాలు శుక్రవారం లబ్ధిదారులతో కిటకిటలాడుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

కామధేను అవార్డుకు వైష్ణవి ఎంపిక



ముదినేపల్లి రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరాబాదులో ఏర్పాటైన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్ ఏటా అందించే కామధేను అవార్డుకు ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఎంపికయ్యారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు 2024 సంవత్సరానికి ఈ అవార్డును వైష్ణవికి అందజేస్తున్నట్లు ప్రకటిస్తూ శుక్రవారం సమాచారాన్ని వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్‌కు అందించారు. ఈ అవార్డును ఈ నెల 11న హైదరాబాదులో అందజేయనున్నట్లు డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. వైష్ణవి పాఠశాల స్థాయి నుంచే స్థానికంగా ప్రైవేటు వైద్యుడిగా కొనసాగుతున్న తండ్రి డాక్టర్ మనోజ్ సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. వీటిని గుర్తించిన విశ్వగురు సంస్థ కామధేను అవార్డుకు ఎంపిక చేసినట్లు సమాచారపత్రంలో పేర్కొంది. వైష్ణవికి ఈ అవార్డు దక్కడంపై ప్రముఖులు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

పమిడిముక్కల: అగినపర్రు శివారు బొడ్డువానిగూడెం ప్రాథమిక పాఠశాలకు నారాయణపురం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ కూచిబొట్ల కిరణ్‌కుమార్ తన కుమార్తె తాన్యా పుట్టినరోజు సందర్భంగా ఆఫీస్ టేబుల్, 10 కుర్చీలు బహూకరించారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోట మణిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కంచర్ల ఆదిశేషులు హెచ్‌ఎం షర్మిలకు టేబుల్, కుర్చీలు అందజేశారు. విద్యార్థులకు స్వీట్లు, గిఫ్టులు అందజేశారు. దాత కిరణ్‌కుమార్‌కు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ అనిల్, టీచర్ ఎన్.బసవమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్డుల పంపిణీని వేగవంతం చేయాలి

పెదపారుపూడి: పేదలకు అందిస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని సుమారు 10 వేల ఆరోగశ్రీ కార్డులకు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సుమారు ఎనిమిదివేల కార్డులను అందజేసినట్లు తెలిపారు. ఎంపీపీ గోగం సురేష్, పీహెచ్‌సీ వైద్యులు సందీప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత

పెదపారుపూడి: రోడ్డు మీద పర్సును పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అప్పగించిన సంఘటన పెదపారుపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు పెదపారుపూడి నాలుగు రోడ్ల కూడలిలో గ్రామానికి చెందిన పీటర్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం పర్సు పోగొట్టుకున్నాడు. ఆ పర్సు పోలీసులకు దొరకడంతో పర్సు ఎవరిది అని విచారణ చేపట్టడంతో గ్రామానికి చెందిన పీటర్‌దిగా గుర్తించారు. బాధితుడ్ని స్టేషన్‌కు పిలిపించి పర్సును అప్పగించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మండవల్లి: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటమణి మినుము పంట సస్యరక్షణను వివరించారు. ఎంఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ ఈకేవైసీ ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని తెలియజేశారు.

రైతుల సంక్షేమానికి కృషి

ముదినేపల్లి రూరల్: రైతులసంక్షేమానికి కృషి చేసి మన్ననలు పొందుతానని నూతన కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేబోయిన వీర్రాజు అన్నారు. చినకామనపూడిలో యాదవ కమిటీ ఆధ్వర్యంలో వీర్రాజుకు ఘన సన్మానం శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కైకలూరు వ్యవసాయ మార్కెట్‌ద్వారా గ్రామాల్లో లింకు రోడ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి నివేదించామన్నారు. నాయకులు తలారి రామకృష్ణ, భట్రాజు వీరుళ్లు, కరేటి రామారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కూచిపూడి(మొవ్వ): ఫోరమ్ ఫర్ ఆర్‌టీఐ క్యాలెండర్‌ను కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్ఐ టి.శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. విక్టర్ పాల్, కాకి రాజశేఖర్, చిగురుపల్లి సుబ్రమ్యం, డొక్కు వెంకట్, ఓరుగంటి శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుడివాడ టౌన్: రెండో శనివారం సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ టి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పేర్ని రవికుమార్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

పామర్రు: స్థానిక మార్కెట్‌యార్డులో శనివారం ఉదయం 11 గంటలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందించనున్నట్లు పేర్కొన్నారు.

పెదపారుపూడి: పెదపారుపూడి హైస్కూల్లో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు నాలుగో విడత ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అందజేస్తారని ఎంపీపీ గోగం సురేష్ తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీఎం వసంతరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కలిదిండి: కలిదిండి పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో కేసులు, సిబ్బంది పనితీరును ఎస్సై ప్రియకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొవ్వ: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన బార్లపూడి, భట్లపెనుమర్రు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూచపూడి ఎస్ఐ టి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలను వివరించారు.